క్లుప్తంగా

200 మందికి అన్నదాన వితరణ



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఇంకొల్లు (చినగంజాం): విద్యాభివృద్ధికి వరలక్ష్మి అందించిన సేవలు ఆదర్శనీయం అని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం ఇంకొల్లు గ్రామంలో ఆవులమంద వరలక్ష్మి 8వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇంకొల్లులో 1979లో శాంతినికేతన్ పబ్లిక్ స్కూల్ స్థాపించి 33 సంవత్సరాలు అనేక మందికి విద్యాబుద్ధులు నేర్పించిన ఆవులమంద వరలక్ష్మి అందరికీ ఆదర్శనీయం అని అన్నారు. ఈసందర్భంగా గ్రామంలోని సినిమా హాలు సెంటర్ వద్ద వరలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 200 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆవులమంద సుబ్బయ్య, రామకృష్ణ, కిరణ్‌కుమార్, లావణ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీహెచ్ఈఓ నాగేశ్వరరావు

స్వర్ణ (కారంచేడు): పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని స్వర్ణ పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ వీ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని స్వర్ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏఎస్ఎంలు, ఆశాలు మీ పరిధిలో ఇంటింటి గృహ సందర్శనల్లో ప్రజల్లో పై విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత లేకుంటే ఆయా ప్రాంతాలు దోమలకు ఆవాసాలుగా మారతాయన్నారు. తద్వారా అనేక మైన అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి ఇప్పుడు ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీ సిఫోరా, ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

మేదరమెట్ల: ప్రతి రైతూ ఈ-క్రాప్ ద్వారా ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సహాయవ్యవసాయ సంచాలకులు కే.ధన్‌రాజ్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు, బొల్లవరప్పాడు గ్రామాల్లో మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంలో వేసుకునే ఎరువుల మోతాదుకు మించి వినియోగించరాదన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ భరిస్తుందని, రబీలో సాగు చేసుకుంటున్న పైర్లకు రైతులే ఇన్సూరెన్స్ చెల్లించుకోవాలని తెలిపారు. ఏఎంసీ సూపర్‌వైజర్ రామాంజనేయులు, వీఏఏ ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

అదనపు ఆదాయం వచ్చేనా !

- ఖాళీగా ఉన్న ఆర్టీసీ భూములు
- ఆదాయ వనరుగా ఉపయోగించుకుంటే డిపోకు లాభాల బాటే
- స్థలాలు అన్యాక్రాంతమయ్యే ప్రమాదం
- ముందుకురాని ఔత్సాహికులు



ఇంకొల్లులో అలంకారప్రాయంగా ఉన్న ఆర్టీసీ స్థల శిలాఫలకం



ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహిస్తున్న డీపీటీవో (ఫైల్)

చీరాల అర్బన్: ఆర్టీసీని లాభాల బాటలో పట్టించేందుకు అధికారులు నానాతంటాలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని శాఖలు నిర్వీర్యమయ్యాయి. అందులో ఆర్టీసీ కూడా ఒకటి. గత ప్రభుత్వంలో చాలా మేరకు ఆర్టీసీ డిపోలను, వాటి అధీనంలో ఉన్న భూములను లీజులకు ఇచ్చి కొంత మేర లాభాల బాట పట్టేందుకు ప్రయత్నించింది. కాని నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఆర్టీసీకి చెందిన ఎంతో విలువైన భూములు అందుబాటులో ఉన్నా అవి ప్రస్తుతం అక్కరకురావడం లేదు. దీంతో ఆదాయం కోసం డిపో పరిధిలో తిరిగే సర్వీసులపైనే ఆధార పడాల్సివస్తోంది. ఆర్టీసీకి చెందిన ఎకరాలల్లో ఉన్న స్థలాలను లీజుకు ఇచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేసినా అవి ఆచరణలో కనిపించడంలేదు. దీంతో ఎంతో విలువైన స్థలాలు పిచ్చిమొక్కలు మొలిచి నిరుపయోగంగా మారుతున్నాయి.

వివరాల్లోకి వెళితే..

చీరాల ఆర్టీసీ డిపో పరిధిలో చీరాల, పర్చూరు, ఇంకొల్లు, వేటపాలెం, కడవకుదురు, మార్టూరు బస్ స్టేషన్లు ఉన్నాయి. ఈ బస్‌స్టేషన్ల వద్ద ఆర్టీసీకి చెందిన విలువైన స్థలాలు ఉన్నాయి. భవిష్యత్‌లో వాటిని ఆదాయ వనరుగా వాడుకునేందుకు వాటిని కొనుగోలు చేసి ఉంచారు. బస్‌స్టేషన్ నిర్మించి మిగిలిన ఖాళీ భూములు చుట్టూ గుర్తులు వేశారు. చీరాల ఆర్టీసీ గ్యారేజి వద్ద 59950 చదరపు గజాలు, పర్చూరు బస్‌స్టేషన్ వద్ద 3792 చదరపు గజాలు, ఇంకొల్లు బస్‌స్టేషన్ వద్ద 24200 చదరపు గజాలు, మార్టూరు బస్టాండ్ వద్ద 3792 చదరపు గజాలు, వేటపాలెం బస్టాండ్ వద్ద 2619 చదరపు గజాలు ఖాళీగా ఉన్నాయి. అప్పట్లో ఇంకొల్లులో డిపో ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ ఆర్‌అండ్‌బీ నుంచి స్థలాన్ని కొనుగోలు చేసింది. డిపో నిర్మాణం చేపట్టేందుకు శిలాఫలకాన్ని కూడా ఏర్పాటు చేసి చుట్టూ ఫెన్సింగ్‌ను నిర్మించారు. కాని నేటి వరకు అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. శిలాఫలకం చుట్టూ చిల్లచెట్లు మొలిచాయి. ఇటీవల అక్కడ శుభ్రం చేయడంతో శిలాఫలకం మాత్రమే అలంకారప్రాయంగా దర్శనమిస్తుంది. వాటిపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారించకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి.

ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం..

విలువైన స్థలం కావడంతో ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉంది. బస్‌స్టేషన్ల పరిధిలోని ఆర్టీసీకి చెందిన స్థలాలను ప్రైవేటు వారికి అద్దె ప్రాతిపదికన రెస్టారెంట్లు, ట్యూటోరియల్స్, షాపింగ్ కాంప్లెక్సులు, కళాశాలలు, రెస్టారెంట్లు, బుక్ షాపులు ఏర్పాటు చేసుకునేందుకు గతంలో టెండర్లు ఆహ్వానించింది. ఆర్టీసీకి చెందిన స్థలాలను 15 సంవత్సరాలు పాటు లీజుకు ఇచ్చేందుకు పలుమార్లు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమావేశాలు నిర్వహించారు. అయితే వీటిపై ఎటువంటి స్పందన లేదు. చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లోని ఖాళీ స్థలం మాత్రం లీజుకు ఇచ్చారు. డిపో పరిధిలోని బస్‌స్టేషన్ల వద్ద ఉన్న ఎంతో విలువైన ఆర్టీసీ స్థలాలు పనికి రాకుండా పోతున్నాయి. ఖాళీ స్థలాలకు రోజు రోజుకు ధరలు పెరిగిపోవడంతో ఈ భూములు కూడా అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉంది. సర్వీసులు, బస్టాండ్‌లోని స్టాల్స్‌పై వచ్చే అద్దెలే ఆర్టీసీకి ఆదాయంగా మారుతున్నాయి. నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చి వాటిని ఆదాయ వనరుగా ఉపయోగించుకోవచ్చని గతంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు అధికారులకు సూచించారు. దీనిపై గతంలో జిల్లా రీజియన్ మేనేజర్ ఆర్టీసీకి చెందిన స్థలాలను అద్దె ప్రాతిపదిక ఇచ్చేందుకు టెండర్లు పిలిచారు. కాని వాటిపై అంతగా ప్రచారం లేకపోవడంతో స్పందన కరువైంది. ఈ కారణాలతో ఎంతో విలువైన స్థలం నిరుపయోగంగా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. అక్రమార్కుల కన్ను వీటిపై పడితే ఎంతో విలువైన ఆర్టీసీ ఆస్తి అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉంది. ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలాలపై కూడా దృష్టి సారిస్తే చీరాల డిపోకు లాభాలు వచ్చే అవకాశం ఉంది.

ఔత్సాహికులు ముందుకు వస్తే లీజుకిస్తాం..

ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలాలను అద్దెకు ఇచ్చి వాటిని ఆదాయవనరుగా ఉపయోగించుకునేందుకు అవకాశం ఉంది. ఈస్థలాల్లో కళాశాలలు, రెస్టారెంట్లు, ఇతర షాపులు ఏర్పాటు చేసుకోవచ్చు. వీటికోసం టెండర్లు పిలిచేందుకు ప్రతిపాదనలు పంపించాం. పత్రికా ప్రకటనలు ఇచ్చాం. ఔత్సాహికులు ముందుకు వస్తే ఆర్టీసీ స్థలాలను లీజుకిస్తాం.

– జంజనం శ్యామల, డిపో మేనేజర్

అలా వచ్చారు.. ఇలా వెళ్లారు

- తూతూ మంత్రంగా మండల సమావేశం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ మాధవ్

బల్లికురవ: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించేందుకు మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశం గంటన్నరకే మమగా ముగిసింది. స్థానిక పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా అభివృద్ధి పనులపై సమీక్షించగా అధికారులు ప్రగతి నివేదికలు చదివి చేతులు దులుపుకున్నారు. ఎంపీడీవో కుసుమకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే అభివద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేస్తూ చేసిన పనులకు సంబంధించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులచే ఎప్పటికప్పుడు ఎంబుక్ రికార్డింగ్ చేయించుకోవాలన్నారు. సర్పంచ్‌లు సెక్రటరీలు సమన్వయంతో పని చేస్తూ సీజనల్ జ్వరాలు, వ్యాధులు సోకకుండా నవంబర్ మాసాంతం వరకు పారిశుధ్య కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సాధారణ బదిలీల్లో భాగంగా వీఆర్వోలు మారారని చెప్పారు. సమస్యలుంటే గ్రామాల్లో వీఆర్వోల దృష్టికి లిఖిత పూర్వకంగా తెస్తే చర్యలు చేపడతామన్నారు. ఏవో కుమారి, పంచాయతీరాజ్, ఎస్ఎస్ఏ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు మాధవ్, రాజన్‌బాబు, గిరినాయక్, ఎంఈఓ వస్త్రం నాయక్, సీడీపీవో దాసరి సుధా, తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఎయిడ్స్ బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న అతిథులు

మేదరమెట్ల: ఎయిడ్స్ రోగులను తోటివారి వలే ప్రేమగా చూడాలని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో గల హెల్ప్ కార్యాలయంలో దాతల సహకారంతో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులకు నిత్యావసర సరుకులు, పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ నిఖిలారెడ్డి, హెల్ప్ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ హెచ్‌ఐవీ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎయిడ్స్ రోగులను తోటివారి వలే ప్రేమగా చూడాలన్నారు. దాతలుగా వ్యవహరించిన ఒంగోలు రిమ్స్ వైద్యశాల హెచ్‌ఓడీ డాక్టర్ బాలాజీనాయక్, డాక్టర్ కిరణ్మయి, తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఎం రాధ, కరుణ, మల్లీశ్వరీ, దుర్గ, శ్రావణి, కృష్ణవేణి మరియు అద్దంకి, మార్టూరు, నాగులుప్పలపాడు, కొరిశపాడు మండలాలకు చెందిన నిరుపేదలు, హెచ్‌ఐవీ బాధితులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ సెంటర్‌లతో ఉపయోగాలు



మాట్లాడుతున్న తహసీల్దార్ చరణ్

అద్దంకి: గిరిజనుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీ చరణ్ పేర్కొన్నారు. ఎస్టీలందరికీ ఆధార్ కార్డులు ఇచ్చేలా వారం రోజులు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గిరిజనులందరూ ఆధార్ సెంటర్‌లలో కుటుంబాలలోని పిల్లలతో సహా ఆధార్ కార్డులు తీసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు ఉంటే ప్రభుత్వ సంక్షేమ పథకాల నమోదులో ఉపయోగపడతాయని చెప్పారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కో–ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్టీల ఆవాస ప్రాంతాల్లో అధికారులు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, ఇంటి స్థలాలు లేని ప్రతి వ్యక్తికి స్థలం ఇవ్వాలని ఎమ్మార్వోను కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సీడీపీవోకు వినతి పత్రాన్ని ఇస్తున్న నాయకులు

మేదరమెట్ల: అంగన్‌వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొరిశపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీడీపీవో కృష్ణకుమారికి వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి శారద మాట్లాడుతూ అంగన్‌వాడీలు అనేక రకాల ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా పనిచేయాల్సి వస్తుందని దీనివలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అన్ని యాప్‌లు ఒకేదానిలో ఉండేలా చూడాలని కోరారు. అంగన్‌వాడీల ద్వారా సామాజిక పెన్షన్ పంపిణీని నిలుపుదల చేయాలని పలు సమస్యలతో కూడుకున్న వినతి పత్రాన్ని సీడీపీవోకు అందశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, యూనియన్ నాయకులు పార్వతి, మనోలత, భాగ్యలక్ష్మీ, రేవతి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పందిళ్లపల్లిలో మాట్లాడుతున్న డీడీఏ విజయనిర్మల



చక్రాయపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి దీప్తి



గుంటుపల్లిలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి కుమారి

వేటపాలెం: వరి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించుకోవచ్చని వ్యవసాయశాఖ డీడీఏ విజయ నిర్మల పేర్కొన్నారు. మంగళవారం పందిళ్లపల్లి రైతు సేవా కేంద్రంలో 'పొలం పిలుస్తోంది'లో భాగంగా రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. భూసార పరీక్షల ద్వారా వచ్చిన నివేదికలకు అనుగుణంగా ఎరువుల వాడుకోవాలని సూచించారు. డీహెచ్‌వో జానమ్మ మామిడి తోటలో చేయాల్సిన యాజ మాన్య పద్ధతులు, తోటల పునరుద్ధరణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవో కాశీవిశ్వనాథ్, వీఏఏలు, వీహెచ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

పసుపురంగు అట్టలతో రసంపీల్చు పురుగుల నివారణ..

అద్దంకి/బల్లికురవ: పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో అంజిరెడ్డి అన్నారు. మండలంలోని కొమ్మలపాడు గ్రామంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ క్రాప్ బుకింగ్‌తో పాటు, ప్రభుత్వం నుంచి వచ్చే వ్యవసాయ పథకాల సమాచారాన్ని రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఏఏ రవికిరణ్, కాలేషావలి, వెంకటరత్నం, సుబ్బారావు పాల్గొన్నారు.

- మిరప పంటలో రసం పీల్చు పురుగుల నివారణ కోసం పసుపు రంగు అట్టలను పైరులో ఎకరాకు 20 వంతున పెట్టుకోవాలని ఉద్యానశాఖ అధికారి దీప్తి చెప్పారు. మండలంలోని చక్రాయపాలెం, వెంపరాల గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు సూచనలు అందించారు. ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు మండలంలో 100 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. 9వ తేదీ నుంచి అన్ని రైతు సేవా కేంద్రాలలో సామాజిక తనిఖీ కోసం జాబితాలు ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు వీఏఏ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

జింక్‌లోప సవరణతో అధిక దిగుబడులు..

మొక్కజొన్న పంటలో జింక్ లోప సవరణతో అధిక దిగుబడులు పొందవచ్చని మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుంటుపల్లి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వరి, మొక్కజొన్నలో జింక్ లోప నివారణకు దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బందితో పాటు మార్కెటింగ్, పశు సంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు తప్పనిసరి



వార్డు సెక్రటరీలతో సమావేశాన్ని నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

చీరాల: చీరాల మున్సిపాలిటీలో ఇంటి పన్ను, కుళాయి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌లు పూర్తిస్థాయిలో వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ వార్డు ఎమినిటీ సెక్రటరీలకు సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో పన్నుల వసూళ్లపై వార్డు ఎమినిటీ సెక్రటరీలు, పారిశుద్ధ్యంపై వార్డు శానిటరీ, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. నీటి కుళాయిల బకాయిలు వసూలు చేయాలని, నీటిని రెగ్యులర్‌గా పరీక్షలు జరపాలన్నారు. అలానే రోజువారీ పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, ట్రేడ్ లైసెన్స్‌లు నూరు శాతం వసూలు అయ్యేలా చూడాలన్నారు. అలానే ఇంటి, ఖాళీ స్థల పన్నులు, మార్కెట్లకు సంబంధించిన లీజులు, షాపు రూములకు సంబంధించిన అద్దెలు ఆలస్యం కాకుండా వసూలు చేయాలన్నారు. అనంతరం 31వ వార్డులో డ్రైనేజిలో సిల్టు తీసే పనులను ఆయన పర్యవేక్షించారు.

పంచాయతీల్లో సాధారణ పరిపాలనపై శిక్షణ



శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

యద్దనపూడి: 2024–25 సంవత్సరానికి సంబంధించి మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులకు పంచాయతీలలో సాధారణ పరిపాలనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994లోని ముఖ్య నిబంధనలు, వివిధ అంశాలపై రెండు రోజులు పాటు నిర్వహించే మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మహ్మద్ అఖిద్ జావేద్ అధ్యక్షతన నిర్వహించి కార్యక్రమంలో ఏఓ లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ టీవీ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



వేటపాలెం మహాలక్ష్మీదేవిగా కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



రావినూతల కన్యకాపరమేశ్వరీ ఆలయంలో గజలక్ష్మీదేవిగా..



పంగులూరు భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ..



మేదరమెట్ల కనకదుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో



శాకాంబరిదేవిగా దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరీ..



చీరాలలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

లోక స్థితికారిణి.. అమృత స్వరూపిణి

చీరాల అర్బన్/వేటపలెం: 'యాదేవీ సర్వభూతేషు లక్ష్మీరూపేణ సంస్థితా' అంటే అన్ని జీవుల్లోనూ ఉండే లక్ష్మీ స్వరూపం దుర్గాదేవి అని చండీస్తుతి మనకు చెప్తోంది. దసరా శరన్నవరాత్రుల్లో మహాలక్ష్మీదేవిని పూజిస్తే సర్వమంగళ మాంగల్యాలు కలుగుతాయని, మహాలక్ష్మి రూపాన్ని ఆరాధిస్తే అష్టైశ్వర్యాలు, సమస్త సౌభాగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

- దసరా నవరాత్రులు చీరాల పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. దసరా శరన్నవరాత్రోత్సవాలను పట్టణంలోని పలు దేవాలయాలు, వార్డుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్ల వద్ద ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని సంతబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారికి సువర్ణ కిరీటం అలంకరించారు. నవరాత్రులు పాటు ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ అధ్యక్షులు గుంటూరు మాధవరావు తెలిపారు. సీతారామ భక్త సమాజం విఠల్‌నగర్ వారిచే అమ్మవారి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం వాసవీ అమ్మవారు శాకాంబరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలానే పేరాలలోని రామలింగేశ్వరస్వామి దేవాలయం, పేరాలలోని జక్కావారివీధి, ఈపూరుపాలెంలోని పెద్ద పందిరి వీధిలో ఉన్న కనకదుర్గమ్మ పందిరి వద్ద అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పట్టణంలోని పాపరాజుతోటలోని కామాక్షి సోమేశ్వరస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారిని మహాలక్ష్మీ అలంకరణ చేశారు. అమ్మవారికి భక్తుల సహకారంతో స్వర్ణ కవచం చేయించి అమ్మవారికి అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.
- వేటపాలెం మండలంలోని స్థానిక కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. రావూరిపేట శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న కనకన నాగవరపమ్మ అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు.

అద్దంకి రూరల్/మేదరమెట్ల/బల్లికురవ/జే.పంగులూరు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కొరిశపాడు మండలంలోని రావినూతల, మేదరమెట్ల గ్రామాల్లో గల అమ్మవారిని గజలక్ష్మీదేవి, మహాలక్ష్మీదేవి అలంకారాలలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావినూతల కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలోని అమ్మవారిని గజలక్ష్మీదేవిగా, మేదరమెట్ల కనకదుర్గ మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

- పంగులూరు భీమలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో అమ్మవారు భక్తులకు మహాలక్ష్మిదేవిగా దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారికి గులాబిరంగు వస్త్రం సమర్పించి, అమ్మవారికి ప్రసాదంగా పూర్ణం బూరెలు నివేదించారు.

గజలక్ష్మీదేవి అలంకరణ లో అమ్మవారు

- అద్దంకిలోని వాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని గజలక్ష్మీ దేవిగా, ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారిని లలితా త్రిపురసుందరీదేవిగా అలంకరించారు. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా నవరాత్రోత్సవాలు..

కారంచేడు/చినగంజాం/మార్టూరు/యద్దనపూడి: దేవీ సరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దసరా నవరాత్రులు పురస్కరించుకొని ఆరవ రోజు వేకువజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గామాత ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు.

- పర్చూరు మండలంలోని నూతలపాడులో భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం ప్రాంగణంలో మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆది మోహన్‌కృష్ణ, వరలక్ష్మీ, దామరాజు లీలా వెంకట రమణమూర్తి, శ్రీవల్లి దంపతులు పూజలు చేశారు.
- చినగంజాం మండలం సోపిరాల లలితా రామకోటేశ్వర దేవాలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చినగంజాం వాసవీ కన్యకాపరమేశ్వరీ మందిరం, రైల్వేస్టేషన్ విజయ కనకదుర్గ భవాని ఆలయంలో అమ్మవార్లను మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



కారంచేడులో మహాలక్ష్మీదేవి అలంకరణలో గంగమ్మతల్లి



చీరాలలో స్వర్ణ కవచ అలంకరణలో అమ్మవారు



అద్దంకిలో లలితా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు..



చినగంజాంలో మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



వేటపాలెంలో హనుమంత వాహనంపై వెంకటేశ్వరస్వామి



నూతలపాడు దేవాలయంలో మహాలక్ష్మీదేవి అవతారంలో..